క్లుప్తంగా

ఖేడ్ ఎస్ఐగా శ్రీశైలం


రాసుల శ్రీశైలం

నారాయణఖేడ్: ఖేడ్ ఎస్ఐగా రాసుల శ్రీశైలం నియమితులయ్యారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన విద్యాచరణ్ రెడ్డి సంగారెడ్డి రూరల్ ఎస్ఐగా బదిలీపై వెళ్లారు. వికారాబాద్ జిల్లా బంట్వారం పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా పని చేసిన రాసుల శ్రీశైలం ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు ఖేడ్‌లో బాధ్యతలను స్వీకరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

కాంగ్రెస్‌వన్నీ డమ్మీ మాటలే

ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి : కాంగ్రెస్ మాటలన్నీ డమ్మీ మాటలేనని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అసంతప్తితో ఉన్నారని, ఏడాది పాలనలో రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. ఏడాది కాలంలోనే రైతు భరోసా, పూర్తిగా రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిండా ముంచిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లోనే ఇచ్చిన గ్యారంటీను అమలు చేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ నేతల నుంచి జాతీయ కాంగ్రెస్ నేత వరకు వాగ్దానాలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు.

స్మశానవాటికకు స్థలం కేటాయించండి


వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ను సన్మానిస్తున్న మొహిద్ పటేల్


నారాయణఖేడ్: ఖేడ్ పట్టణ ఏఐఎంఐఎం అధ్యక్షుడు, న్యాయవాది మొహిద్ పటేల్ మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయంలో చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పూలమొక్కను అందజేశారు. ఖేడ్ పట్టణంలో ముస్లింలకు స్మశానవాటిక కోసం స్థలం కేటాయించాలని కోరారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించారని మొహిద్ పటేల్ తెలిపారు.

విజయోత్సవాలపై కళాజాత


కళాజాత ప్రదర్శనలిస్తున్న కళాకారులతో అధికారులు, ప్రజాప్రతినిధులు

నారాయణఖేడ్: ప్రజాపాలన- విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని పొట్టిశ్రీరాములు చౌరస్తాతో పాటు పలు ప్రధాన చౌరస్తాల్లో కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. ఏడాదికాలంలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని పాటలు, ప్రదర్శనల ద్వారా వివరించారు. స్థానిక ఆర్డీఓ అశోక చక్రవర్తి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, కమిషనర్ జగ్జీవన్, మేనేజర్ వెంకటశివయ్య, శానిటరీ అధికారి శ్రీనివాస్, కౌన్సిలర్లు వివేకానంద్, హన్మాండ్లు, తాహెర్ అలీ కళాకారులతో పాటు పాల్గొని తిలకించారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ


పడిపూజ నిర్వహిస్తున్న కృష్ణ స్వామి

సంగారెడ్డి టౌన్ : పట్టణంలోని సాయిమాణిక్‌నగర్‌లో మంగళవారం ఆమెటి కృష్ణ (కిట్టు) నివాసంలో బ్రహ్మశ్రీ గంగాధర శర్మ నిర్వహణలో పడిపూజ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో కాలనీ పరిసరాలు మార్మోగాయి. అయ్యప్పమాలధారులు తరలివచ్చి భజనలు, ఆటపాటలతో పూజా కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది. ఆమెటి భాస్కర్, నవీన్ గురుస్వామి, రాధిక, మెడికల్ రాజు గురుస్వామి, జయప్రకాశ్ గురుస్వామి, పాండువర్మ గురుస్వామి, కిరణ్‌స్వామి, గంగరాజు, కాలనీవాసులు ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

హరీశ్‌రావుపై కేసు అప్రజాస్వామికం

జహీరాబాద్ టౌన్: మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుపై కేసు నమోదు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ అన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలు, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నందుకే కేసులు పెట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పక్కదొవ పట్టించేందుకే రాజకీయ కక్షతో అక్రమంగా కేసులు పెడుతుందన్నారు.

లోపాలు సరిదిద్దుకుంటే మంచి దిగుబడి

- కూరగాయల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- తేమ, సూర్యరశ్మితో సాగు ఆశాజనకం
- డీడీఎస్-కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త జి.శైలజ

జహీరాబాద్: భౌతిక లోపాలను సరిదిద్దుకుంటే కూరగాయల సాగులో మంచి దిగుబడులను సాధించవచ్చు. తక్కువ కాంతి, అధిక సూర్యరశ్మి, అతి తక్కువ ఉష్ణోగ్రతలు, లోప భూయిష్టమైన నీటి యాజమాన్యం, పోషకలోపాల వంటి పలు కారణాల వల్ల కూరగాయల మొక్కల్లో కనిపించే లోపాలను భౌతిక లోపాలు అంటారని జహీరాబాద్ డీడీఎస్-కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త జి.శైలజ అన్నారు. కూరగాయల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు.


మల్చింగ్ విధానంలో సాగులో ఉన్న టమాట పంట

టమాట పంట సాగు..

బొద్దుకుళ్లు-పూతపై కుళ్లు: కాయ అభివృద్ధి చెందే దశలో నీటి మచ్చలుగా మొదలై పరిమాణం పెరిగి నల్లగా కనబడుతుంది. కాయ, పూతపై ఈ సమస్య వస్తుంది. అభివృద్ధి చెందే దశలో కాల్షియం లోపంతో ఈ సమస్య వస్తుంది. మొక్కలో నీటి సరఫరా లోపం వల్ల కాల్షియం లోపం ఏర్పడుతుంది. టమాటలో కాయపగుళ్ల సమస్య కూడా అధికంగా ఉంటుంది. కాయ పక్వానికి వచ్చే దశలో వేడి వాతావరణం తర్వాత ఎక్కువ వర్షాలు పడడం, బోరాన్ లోపం వల్ల కూడా కాయపగుళ్లు ఏర్పడుతుంది.

యాజమాన్యం

నేలలో తగినంత కాల్షియం ఉండేలా చూసుకోవాలి. తేమ హెచ్చుతగ్గులు కాకుండా, టమాట మొక్క వేరు దెబ్బతినకుండా జాగ్రత్త పడాలి. కోత దశల్లో కాల్షియం నైట్రేట్ 7.5- 10 గ్రాములు లేదా, కాల్షియం క్లోరైడ్ 4 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాయపగుళ్లు రాకుండా ఉండేందుకు నేలలోతేమను సంరక్షించేందుకు మల్చింగ్ విధానంలో సాగు చేసుకోవాలి.


పగుళ్లు ఏర్పడిన టమాట

కాలిఫ్లవర్ పంట..

కాలిఫ్లవర్‌లో బట్టనింగ్ సమస్య వస్తుంది. చిన్న చిన్న పూలమాదిరిగా ఏర్పడడాన్ని బట్టనింగ్ అంటారు. ముదురు నారు నాటడం, నత్రజని తక్కువ అవడం, స్వల్పకాలిక రకాలను ఆలస్యంగా నాటడం వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది.

యాజమాన్యం: 21-25 రోజులు వయసు కలిగిన నారును నాటుకోవాలి. మోతాదుగా నత్రజని ఎరువులు వేసుకోవాలి. స్వల్పకాలిక రకాలను సిఫారసు చేసిన సమయంలో నాటుకోవాలి. రైసినెస్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు అధిక ఉష్ణోగ్రతను తట్టుకునే రకాలను నాటుకోవాలి. పువ్వులను సకాలంలో కోసుకోవాలి.

ఆలుగడ్డ పంట..

ఆలుగడ్డ పంటలో దుంప అభివృద్ధి చెందే దశలో పచ్చబడుతుంది. దుంపలపై సూర్యరశ్మి పడడం వల్ల ఈ సమస్య వస్తుంది. దీని నుంచి బయట పడేందుకు అంతర కృషి చేయడంతో పాటు మొక్క మొదళ్లకు మట్టిని ఎగదోయాలి.

దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


వీల్‌చైర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం, ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పటాన్‌చెరు సర్కిల్ పరిధిలోని మూడు డివిజన్లకు సంబంధించిన 225 మంది దివ్యాంగులకు రూ.17.97 లక్షలతో కొనుగోలు చేసిన వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు, చేతి కర్రలు, ట్రై సైకిళ్లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. శారీరక లోపాలను అధిగమించి నేడు దివ్యాంగుల సైతం అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారని అన్నారు. గతంలో 400 మంది దివ్యాంగులకు రూ.4 కోట్ల సొంత నిధులతో ద్విచక్ర వాహనాలను అందించామని గుర్తు చేశారు. కార్పొరేటర్లు మెట్టుకుమార్ యాదవ్, సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్ప, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, సీఐ వినాయక్‌రెడ్డి, అఫ్జల్ పాల్గొన్నారు.

కల్హేర్‌లో.. సిర్గాపూర్ మండలం కడ్పల్‌లో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. గ్రామంలోని భవిత కేంద్రంలో ఆట పోటీలు ఏర్పాటు చేశారు. ఎంఈఓ నాగరం శ్రీనివాస్ బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న నిర్మల, కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్: 'వాసవీ మా ఇల్లు' సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో టీజీఐసీ చైర్ పర్సన్ నిర్మల, జిల్లా కలెక్టర్ క్రాంతి, వ్యవస్థాపకులు తోపాజి అనంతకిషన్ అధికారులతో కలిసి సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు 1100 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థకు వచ్చిన జాతీయ గుర్తింపు పత్రాన్ని వ్యవస్థాపకుడికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'వాసవీ మా ఇల్లు' సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మాధురి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి జగదీష్, సంస్థ ప్రధాన కార్యదర్శి పుల్లూరి ప్రకాష్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు విద్యాసాగర్, వర్తక సంగం పట్టణ అధ్యక్షుడు పాండురంగం, కార్యదర్శి మదన్మోహన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సంతోషకుమార్, కౌన్సిలర్ నాగరాజు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ డబ్బులు చెల్లించాలని ధర్నా



కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

జహీరాబాద్ టౌన్: లెప్రసీ సర్వేకు సంబంధించిన పెండింగ్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు మంగళవారం క్లస్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు శశికళ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల ద్వారా లెప్రసీ సర్వే చేయించుకుని నెలలు గడుస్తున్నా డబ్బులు చెల్లించలేదన్నారు. మళ్లీ సర్వే చేయమనడం శోచనీయమన్నారు. పెండింగ్ డబ్బులు చెల్లించి తరువాత కొత్త పనులు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీహెచ్‌ఓం రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు శశిరేఖ, నందమ్మ, లక్ష్మి, నిర్మల, శ్యామల పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మునిపల్లి(అందోల్): ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల ఆశావర్కర్లు మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నిరసన చేపట్టారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల ఆశావర్కర్లు లెప్రసీ, పల్స్ పోలియో సర్వే చేసిన పెండింగ్ డబ్బులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్లకు నెలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మండల నాయకులు రమేశ్‌గౌడ్, సంగీత, మంజుల, సావిత్రి, పద్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు ముఖ్యం

ఆర్డీఓ పాండు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆర్డీఓ

జోగిపేట(అందోల్): చదువుతో పాటు క్రీడలకు విద్యార్థులు ప్రాధాన్యం ఇవ్వాలని అందోల్-జోగిపేట ఆర్డీఓ పాండు అన్నారు. జోగిపేట ప్రైవేట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జోగిపేటలోని డాన్‌బాస్కో పాఠశాలలో నిర్వహించిన క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. తనకు క్రీడలంటే చాలా ఇష్టమని, 1983లో మొదటిసారి ఇండియా వరల్డ్ కప్ సాధించినప్పటి నుంచి తాను క్రికెట్‌కు అభిమానిగా మారానన్నారు. నిజాం కళాశాలలో చదువుకున్న రోజుల్లో అన్ని క్రీడల్లో పాల్గొనే వాడినన్నారు. క్రీడాకారులు విద్యలో కూడా ముందుంటారన్నారు. మండల విద్యాధికారి బండి కృష్ణ మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలన్నీ ఒకే వేదిక మీదకు రావడం, క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం తరఫున నిర్వహించే ఎస్‌జీఎఫ్ క్రీడల్లో కూడా ప్రైవేట్ పాఠశాలలు కూడా భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర రావు, ఉపాధ్యక్షుడు రుపస్, కోశాధికారి వెంకటేశం, సహాయ కార్యదర్శి రామకృష్ణ, డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, లయన్స్‌క్లబ్ జిల్లా కార్యదర్శి ఎ.రాంబాబు, ఫిజికల్ డైరెక్టర్ వీబీ శ్రీనివాస్ ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్యారంటీల అమల్లో కాంగ్రెస్ విఫలం

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి

పటాన్‌చెరు: గ్యారంటీల అమల్లో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గోదావరి విచ్చేసి జెండాఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపు మేరకు అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ గురించి ప్రజలకు తెలియజేసేందుకే బైక్ ర్యాలీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రవీందర్, కౌన్సిలర్లు రమేష్, శంషాబాద్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, సుజాత, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గుప్తా, మండల అధ్యక్షుడు వీరేశం, రాజు, బీజేవైఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్టీ హాస్టల్ ఆకస్మిక తనఖీ

జహీరాబాద్ టౌన్: మండల కేంద్రం మొగుడంపల్లిలోని ఎస్టీ హాస్టల్‌ను మంగళవారం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల ప్రత్యేక అధికారి గోపాల్, ఎంపీడీఓ మహేశ్, తహసీల్దార్ హసీనా బేగం విద్యార్థుల గదులు, వంటగది పరిసరాలను పరిశీలించారు. వంటగదిలో నిల్వ ఉంచిన నిత్యావసర సరుకులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రత్యేక అధికారి గోపాల్ సిబ్బందిని ఆదేశించారు.

హరీశ్‌రావును కలసిన నేతలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మాజీ మంత్రి హరీశ్ రావును మంగళవారం పటాన్‌చెరు సర్కిల్ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు వాలెశెట్టి క్రాంతి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లుతున్నాట్లు చెప్పారు. అనంతరం హరీశ్‌రావును సన్మానించినట్లు తెలిపారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖేడ్‌లో నిర్వహించనున్న సంగారెడ్డి జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌ను మంగళవారం సంఘం నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమై అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టారు. నూతన ఉపాధ్యాయుల నియామకం, పాఠశాలలకు సర్వీస్ పర్సన్లు నియమించామని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞాన మంజరి, జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు కాశీనాథ్ జాదవ్, జిల్లా కార్యదర్శి నరేష్, నారాయణఖేడ్ డివిజన్ నాయకులు హరిసింగ్, రాజు, ఏసుదాస్ పాల్గొన్నారు.

ఆర్సీపురంలో హుండాయ్ షోరూమ్



రామచంద్రపురం (పటాన్‌చెరు): దేశంలోనే ప్రతిష్టాత్మక వాహన సంస్థ హుండాయ్ మోటార్స్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్)తాజాగా హైదరాబాద్‌లోని ఆర్సీపురం, షేక్‌పేట్, నార్సింగిలో కొత్త షోరూమ్‌లను ప్రారంభించింది. సంస్థ చీఫ్ ఆపరేటింగ్ అధికారి తరుణ్ గార్గ్ మంగళవారం ఈ షోరూమ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీ పరిశ్రమలకు, అంకుర సంస్థలకు ప్రస్తుతం తెలంగాణ రాజధానిగా మారిన నేపథ్యంలో మార్కెట్ విస్తృతమైందన్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు దక్షిణాది విస్తరణలో భాగంగా తెలంగాణ మార్కెట్‌పై దృష్టికేంద్రీకరించామని తెలిపారు. రాష్ట్రంలో 50 షోరూమ్‌లను ప్రారంభించే యోచనలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. వినియోగదారులకు విలువైన, నాణ్యమైన ఉత్పత్తులను అందించడమే లక్ష్యంగా తెలంగాణ మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **శ్రీకాంతాచారి ఘన నివాళి**

పటాన్‌చెరు టౌన్: మలిదశ ఉద్యమానికి తన ఆత్మ బలిదానంతో ఊపిరిలూది ఉద్యమం ఎగిసేలా చేసిన మహనీయుడు శ్రీకాంతాచారి అని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. మంగళవారం శ్రీకాంతాచారి వర్ధంతిని పురస్కరించుకొని చిట్కుల్‌లో శ్రీకాంత్ చారి చిత్రపటానికి పూలమాలల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమాన్ని అణిచివేయడానికి సమైక్యాంధ్ర పాలకులు పన్నాగాలు చేస్తున్న తరుణంలో తన ఆత్మబలిదానంతో ఉద్యమకారుల్లో స్ఫూర్తి నింపారని కొనియాడారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఉద్యమకారుల కుటుంబాలను రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి గౌరవిస్తుందన్నారు.

◆ **ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన**

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆటో డ్రైవర్లకు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ట్రాఫిక్ రూల్స్‌పై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కాశీనాథ్ మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లకూడదన్నారు. డ్రైవర్లు మద్యం సేవించి ఆటో నడపరాదని హెచ్చరించారు. ఎక్కడబడితే అక్కడ పార్కింగ్ చేయొద్దని సూచించారు. పట్టణంలోని పస్తాపూర్ చౌరస్తాలో పోలీసులు వాహనాలను తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలు విధించారు.

◆ **ఇళ్ల స్థలాలు కేటాయించండి**

జిన్నారం (పటాన్‌చెరు): మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిని పేదల ఇళ్ల స్థలాలకు ఇవ్వాలని జిన్నారం గ్రామస్తులు తహసీల్దార్ భిక్షపతికి వినతి పత్రం అందజేశారు. జిన్నారం సమీపంలోని 1002 సర్వే నంబర్ ప్రభుత్వ భూమి సుమారు మూడు ఎకరాలను ప్రైవేటు వెంచర్‌కు ఇచ్చేందుకు కుట్ర జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తానని హామీ మాట తప్పడంతో ధర్నాకు దిగామన్నారు. రియల్ వ్యాపారులకు బడా నాయకులకు స్థానిక ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రభుత్వ భూములను అప్పజెప్తున్నారని విమర్శించారు. ఇప్పటికే హెచ్ఎండీఏకు పేద రైతుల భూములను బలవంతంగా ఇండస్ట్రియల్ పేరిట అప్పగించారని మండిపడ్డారు. ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక అఖిలపక్ష నాయకులు ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

◆ **వాహనాల వేలం**

సంగారెడ్డి రూరల్ : ఆయా కేసులో పట్టుపడ్డ టూ వీలర్ యాక్టివా, టాటా సఫారీ కారు, మూడు ఇతర స్క్రాప్ వాహనాలు బుధవారం వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నజీర్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు సంగారెడ్డి ఎక్సైజ్ కార్యాలయానికి వెళ్లాలన్నారు.

◆ **మందుబాబులకు జరిమానా**

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో ఏడుగురుని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా ఏడుగురికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సంగారెడ్డి పట్టణంలో..

పట్టణటౌన్ ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం అర్ధరాత్రి పాత బస్టాండ్, పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. ఇందులో తొమ్మిదిమంది వాహనదారులు మద్యం సేవించి పట్టుపడ్డారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా జడ్జి ఒక్కరికి రూ.1500, మిగతా వారికి రూ. 2000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

◆ **సమస్యలపై నిరంతర పోరాటం**

జహీరాబాద్ టౌన్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి చేస్తోందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం పీఆర్టీయూ ఆత్మీయ సమ్మేళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు కోసం పోరాటం చేస్తున్నామని, ఇది తమ ప్రథమ కర్తవ్యమన్నారు. ఓపీఎస్ రద్దుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ బకాయిల విడుదలకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభు, గౌరవ అధ్యక్షుడు తులసీరాం రాథోడ్ పాల్గొన్నారు.

◆ **దివ్యాంగులకు ఇబ్బందులు కల్గించొద్దు**

సంగారెడ్డి టౌన్ : దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగుల హక్కులకు భంగం కలిగించొద్దన్నారు. న్యాయపరమైన సలహా కోసం జిల్లా కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సబిత పాఠశాల నిర్వాహకులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కిష్టయ్య**

జహీరాబాద్ టౌన్: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జహీరాబాద్‌కు చెందిన నిమ్మల కిష్టయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కామారెడ్డిలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. జహీరాబాద్ ప్రాంతంలోని ఇప్పెపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కిష్టయ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడంపై పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

◆ **జీరో ప్లాస్టిక్ కవర్లను వినియోగించండి**

సదాశివపేట(సంగారెడ్డి): ప్రజలందరూ జీరో ప్లాస్టిక్ ను వినియోగించి పర్యావరణాన్ని కాపాడాలని మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణపాటిల్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా జీరో ప్లాస్టిక్ ప్రోడక్ట్ స్టోర్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు చౌదరి ప్రకాష్, సత్యంగౌడ్, కమిషనర్ ఉమ, డీఎంసీ మల్లేశ్వరీ, టీపీఓ భాస్కర్‌గౌడ్, ఇంజనీర్ రాజేష్, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

◆ **ఉచిత వైద్య శిబిరం**

నారాయణఖేడ్: మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్మికులు, సిబ్బందికి వైద్యులు డా.సుశీల్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా అందజేశారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ అవగాహన కల్పించారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, కమిషనర్ జగ్జీవన్‌లు పర్యవేక్షించారు.